అందమైన యువతి

టెంపోరావ్

చేత్తో చిన్న సూట్‌కేసు పట్టుకుని ఆమె యింటిముందు ఆగింది. గేటు తెర్చి ఆమె ముందు వరండామీదకు వెళ్ళి కాలింగ్ బెల్ బటన్ నొక్కింది. బెల్ మ్రోగ గానే 28 ఏళ్ళ యువతి బయటకొచ్చి ఆమెవైపు చూసింది.

"గుడ్ మార్నింగ్!" అందామె.

గుడ్ మార్నింగ్ చెప్పి, "మీకెవరు కావాలి?" అని అడిగింది రాధిక.

ఆమె తీయగా నవ్వింది.

"నా పేరు లత. లక్ష్మి నా కజిన్ సిస్టరు. స్టేషన్‌కి వచ్చి నన్ను రిసీవు చేసుకుంటానని రాసింది. కాని మర్చిపోయిందేమో, రాలేదు. చాలాసేపు ఆమెకోసం ఎదురు చూసి యిక్కడికొచ్చాను" అందామె.

"రండి, కూర్చోండి" అంది రాధిక.

హాల్లోని పేము కుర్చీల్లో యిద్దరూ కూర్చున్నారు. పైన ఫాన్ తిరుగుతోంది.

"లక్ష్మి బ్యాంకికి వెళ్ళిపోయింది. సాయంత్రం ఐదింటికి వస్తుంది. ఆమె భర్త రామచంద్రన్ గారు ఫాక్టరీకి వెళ్ళారు. ఆయన రాత్రి ఏడు దాటాక వస్తారు. వాళ్ళు పైభాగంలో వుంటున్నారు."

"గుడ్ గాడ్, సాయంత్రందాకా నేనిక్కడ మిమ్మల్ని బోర్ చేస్తూ కూర్చోవలసిందేనా?" అంది లత.

రాధిక నవ్వింది.

"అలా అనకండి. నేను ఒంటరిగానే వున్నాను. ఆయన ఆరింటికి వస్తారు. మాకు పిల్లలు లేరు."

అలసటగా ఆమె రాధికవంక చూసింది.

"కొంచెం మంచినీళ్ళు యిస్తారా?"

రాధిక లోపలకు వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. కుండలోని నీళ్ళు చల్లగా వున్నాయి. ఆమె గడగడ రెండు గ్లాసుల నీళ్ళు తాగేసింది.

"కాఫీ యిస్తాను, వుండండి" అని రాధిక లేచింది.

"కాస్సేపయ్యాక యిద్దురుగాని" అందామె.

"మీరు ఏం చేస్తున్నారు?"

"బి.ఎ. పాసయ్యాను."

"పెళ్ళి కాలేదనుకుంటాను?"

"ఇంకా కాలేదు. కట్నం యిచ్చి పెళ్ళి చేసుకోడం నాకిష్టంలేదు."

"మీ ఆదర్శాన్ని మెచ్చుకుంటున్నాను. నా పెళ్ళి కట్నంలేకుండానే అయింది. మాది లవ్ మేరేజి!" అంది రాధిక.

"అలాగే వుండాలి. ఐ యామ్ హేపీ!"

లోపలకు వెళ్ళి కాఫీ తెచ్చి రాధిక యిచ్చింది.

"మీకు శ్రమ కలిగిస్తున్నాను!"

"ఫరవాలేదు."

ఆమె కాఫీ తాగింది.

"ఇక్కడెక్కడైనా ఫోనుందా? ఒకసారి బ్యాంకికి ఫోన్ చేసి లక్ష్మితో మాట్లాడాను."

"సమీపంలో వున్న మురగన్ మెడికల్ స్టోర్స్‌లో ఫోనుంది. పై ఫ్లాట్ తాళంచెవులు నాకిచ్చి లక్ష్మి బ్యాంకికి వెళుతుంది. మీరు పైకి వెళ్ళి విశ్రాంతిగా కూర్చోవచ్చు."

"లక్ష్మితో మాట్లాడివస్తాను" అని ఆమె సూట్ కేసును అక్కడ వదిలి బయటకు వెళ్ళిపోయింది.

పదిహేను నిమిషాలు తర్వాత ఆమె తిరిగి వచ్చింది.

"మాట్లాడారా?" అడిగింది రాధిక.

"దాన్ని మహా తిట్టేశాను. ఇవాళ మీ ఇంటికే వస్తానంది. స్నానంచేసి, బట్టలు మార్చుకుని నన్ను తన బ్యాంకికి రమ్మంది. ఇద్దరం తిరిగివస్తాం."

రాధిక లోపలకు వెళ్ళి తిరిగొచ్చి తాళంచెవుల గుత్తిని ఆమెకిచ్చింది.

"ఆ మెట్లమ్మట పైకి వెళ్ళండి. స్నానంచేశాక యిక్కడికొచ్చి భోజనంచేసి వెళ్ళండి" అందామె.

"చాలా థాంక్స్" అని ఆమె పైకి వెళ్ళింది.

అరగంట తర్వాత ఆమె కిందకు దిగి వచ్చింది. తాళం చెవులను ఆమెకిచ్చేసింది.

"సూట్ కేస్‌తో కూడా బ్యాంకికి వెళ్తారా?"

"లక్ష్మి నేనూ కొంత షాపింగ్ చేసి వస్తాం అందుకని సూట్ కేసు పట్టుకెళుతున్నాను."

"భోజనం చేద్దురుగాని రండి!"

"మరోసారి చేస్తాను. యిప్పుడు ఆకలిగా లేదు. నేనిక్కడ రెండు రోజులు వుంటాను."

"బ్యాంకి అడ్రెసు తెల్సుగా?"

"ఫోన్‌లో ఆమె వివరంగా చెప్పింది. మీకు చాలా థాంక్స్. మీరు ఎంతో ఆప్యాయంగా నన్ను చూశారు. వెళ్ళివస్తాను" అందామె.

"రేపు మా యింట్లో భోజనం చేయాలి."

"అలాగే చేస్తాను. మీరిచ్చిన కాఫీ చాలా బాగుంది. మీ వంటకాలుకూడా చాలా బాగా వుండాలి."

నవ్వుతూ ఆమె బయటకు నడిచింది. రాధిక హాల్లోకి వెళ్ళి ముందు తలుపు మూసుకుంది.

2

సాయంత్రం ఐదింటికి లక్ష్మి యింటికొచ్చింది. ఆమె వైపు రాధిక ఆశ్చర్యంగా చూసింది.

"ఏమిటి ఒంటరిగా వచ్చారు? మీ కజిన్ సిస్టర్ ఏమైంది?" ప్రశ్నించింది రాధిక.

"కజిన్ సిస్టర్ ఎవరు? నా కటువంటి వాళ్ళెవరూ లేరే!"

క్షణకాలం రాధిక నోటమ్మట మాట పెగల్లేదు.

"ఆమె వచ్చింది. పేరు లతని చెప్పింది. మీతో ఫోన్‌లో మాట్లాడతానని మురుగన్ మెడికల్ స్టోర్స్‌కు వెళ్ళి తిరిగివచ్చి మాట్లాడానంది. తాళంచెవులు ఆమెకిచ్చాను. స్నానంచేసి మీరే మీ ఆఫీసుకు రమ్మన్నారట. ఆమె అరగంట తర్వాత మీ బ్యాంకికి వెళ్ళింది."

గాభరాతో ఆమె చెప్పినదంతా లక్ష్మి విన్నది.

తాళంచెవులు తీసుకుని లక్ష్మి పైకి పరుగెత్తింది. వెనకనే వెళ్ళింది రాధిక.

"ఆమె మోసగత్తెలా లేదు. చదువుకున్న, సంస్కారం గల యువతిలా వుంది" అంది రాధిక.

తాళంతీసి లక్ష్మి లోపలకు వెళ్ళింది. బీరువా తెరిచి చూసింది. అమాంతంగా అర్చింది.

"ఆ దొంగముండ నా నగలన్నీ ఎత్తుకుపోయింది. డబ్బంతా పట్టుకుపోయింది. ఆయనవచ్చి ఏమంటారో!"

రాధిక భయంతో లక్ష్మివంక చూసింది.

"ఇంటికొచ్చాక ఆయన యేమంటారో అని నాకు భయంగా వుంది. యాభై వేల రూపాయల విలువగల బంగారం నగలు పోయాయి. అదికాక ఐదువేలు పైన కాష్ మాయమైంది" అంది లక్ష్మి.

"నేను తప్పు చేశాను. ఆమెకు తాళంచెవులు యివ్వకుండా వుంటే బాగుండేది!" అంది రాధిక.

"ఆమె మిమ్మల్ని నమ్మించింది. నాతో ఫోన్‌లో మాట్లాడానని చెప్పి మీలో ఏర్పడిన నమ్మకాన్ని ఇంకా బలపర్చింది. ఆ స్థితిలో నేనుకూడా తాళంచెవులు ఇచ్చేదాన్ని" అంది లక్ష్మి.

నిమిషాలు గడుస్తున్నాయి. గదులన్నీ లక్ష్మి వెతికి చూస్తోంది.

"బీరువాలోని వస్తువులు మాత్రం అది పట్టుకు పోయింది. మరేమీ ముట్టుకోలేదు!"

లక్ష్మి వంట గదిలోకి వెళ్ళింది. మోడర్న్ బ్రెడ్ కవరు నేలమీద పడివుంది. దానివైపు లక్ష్మి సూటిగా చూసింది.

"ఆ పాకెట్‌లో వుండే బ్రెడ్ ముక్కలు ఆమె పూర్తిగా తినేసింది" అంది లక్ష్మి.

"ఆకలిగా వుండుండాలి! మా యింట్లో కూర్చుని

రెండు గ్లాసుల నీళ్ళు, కాఫీ తాగేసింది. ఆమె దొంగని యెవ్వరూ అనుమానించరు. చక్కగా మాట్లాడుతుంది. చదువుకున్నదయి వుండాలి" అంది రాధిక.

"చదువుకున్న వాళ్ళు వుద్యోగాలు దొరక్క అలా తయారవుతారా" అంది లక్ష్మి.

"ఖర్మగాని దానికి ఉద్యోగం ఎందుకు? ఆమె చాలా అందంగా వుంది. వయసు 24 పైన వుండదు. ఎందరో యువకులు ఆమెను పెళ్ళాడ్డానికి గెంతులేస్తూ వస్తారు" అంది రాధిక.

ఏడు తర్వాత రామచంద్రన్ వచ్చాడు. జరిగినదంతా భార్య అతడితో చెప్పింది.

"వెంటనే పోలీసు రిపోర్టు యివ్వాలి" అన్నాడతను.

రాధిక భర్త వీరేశం అతడివైపు చూశాడు.

"నా భార్యను ఇందులో యిరికించకండి. మా తాళం చెవులు తీసుకోవద్దని నా భార్యతో యెన్నిసార్లో చెప్పాను" అన్నాడు వీరేశం.

"ఆమె యిందులో యిరుక్కోదు. మీరు భయపడకండి" అన్నాడు రామచంద్రన్.

ఇన్‌స్పెక్టర్ రాకేష్ శర్మ జీపులో వాళ్ళ యింటికొచ్చాడు. మెట్లెక్కి పైకి వెళ్ళాడు. రామచంద్రన్ అతడితో కరచాలనం చేశాడు.

"ఇన్‌స్పెక్టర్, ఆమె చాలా తెలివిగా మోసం చేసింది. ఆమెను మీరు వెంటనే పట్టుకోవాలి" అన్నాడు రామచంద్రన్.

"డోంట్ బాదర్, ఆమె యెక్కడుందో మేం కనుక్కుంటాం. అంతా వివరంగా చెప్పండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

రామచంద్రన్ అంతా వివరంగా చెప్పాడు.

"మీరు, మీ భార్యా ఆమెను చూడలేదు!"

"లేదు, సార్."

"ఆమెను చూసిన వ్యక్తి శ్రీమతి రాధిక.

"అవును."

"ఆమెతో మాట్లాడాలి!"

"ఆమె కిందభాగంలో వుంటోంది. మీరు అక్కడకు వెళ్ళి ఆమెతో మాట్లాడొచ్చు."

ఇన్‌స్పెక్టర్ రాకేష్ శర్మ మెట్లు దిగాడు. కింద హాల్లోకి వెళ్ళాడు. వీరేశం అతడివైపు పరధ్యానంగా చూసి, "ఏం కావాలి" అని అడిగాడు.

"రాధికతో మాట్లాడాలి."

వీరేశం భార్యను పిల్చాడు. వంటింట్లోంచి ఆమె నవ్వుతూ వచ్చింది.

ఇన్‌స్పెక్టర్ ఆమెవైపు సూటిగా చూశాడు.

"మీరు చూసిన యువతి యెలా వుంటుంది?" అడిగాడతను.

"ఆమె చాలా అందంగా వుంది, సార్. బి.ఎ. పాసయ్యానని నాతో చెప్పింది."

"ఆమెను యింకా వర్ణించాలి.

రాధిక కాస్సేపు ఆలోచిస్తూ వుండిపోయింది.

ఆమె పచ్చగా వుంది. కోలముఖం. పొడుగాటి జడ. చెవులకు కమ్మలున్నాయి. మెడలో ఒంటిపేట గొలుసుంది. చేతిలో సూటుకేసు వుంది. ప్రింటెడ్ సిల్కు చీర ధరించిందామె. కాళ్ళకు ఎర్రటి స్లిప్పర్సు వున్నాయి. కుడిచేతికి మాత్రం గాజులున్నాయి. ఎడంచేతికి చక్కటి వాచ్ వుంది."

"ఆమెను యెక్కడేనా మీరు మళ్ళా చూస్తే పోల్చగలరా?"

"తప్పకుండా పోలుస్తాను."

ఇన్‌స్పెక్టర్ ఆమెవైపు సూటిగా చూశాడు.

"రాధికగారూ, పత్రికల్లో ఇటువంటి మోసాలను గురించి మీరు చదివే వుంటారు. ఆమెను మీరంతగా యెందుకు నమ్మారు?" ప్రశ్నించాడతను.

"ఆమె చాలా మంచిదానిలా నాకు అనిపించింది. ఆదర్శాలున్న యువతి అని అనుకున్నాను. ఆమె చక్కగా మాట్లాడుతుంది.

"ఆమెకు పెళ్ళయి వుంటుందా?"

"కాలేదండి. ఆమె చెప్పిన మాటల్లో కనీసం అదేనా మనం నమ్మాలి" అందామె.

"ఆమె చెప్పిందేదీ నమ్మలేం. ఇటుపైన అటువంటి వాళ్ళు యిక్కడకు వస్తే జాగ్రత్తగా వుండండి" అని అతడు మెట్లెక్కి పైకి వెళ్ళాడు.

రామచంద్రన్ అతడికొక జేబు రుమాలు చూపించాడు.

"ఇన్‌స్పెక్టర్, యీ రుమాలు మాదికాదు, ఆమెదై వుండాలి" అన్నాడతను.

రుమాలువైపు ఇన్‌స్పెక్టర్ పరీక్షగా చూశాడు. అటువంటి రుమాళ్ళు బట్టల షాపుల్లో అనేక చోట్ల దొరుకుతాయి.

"దీన్ని ఎవ్వరూ ముట్టుకోకండి. వెంటనే పోలీస్ డాగ్‌ని రప్పిస్తాను" అన్నాడతను.

"ఇన్‌స్పెక్టర్, పోయిన నగల లిస్టు యిది. అన్నీ వివరంగా చూశాను. అవికాక ఐదు వేలు కాష్ కూడా పోయింది."

"అంత క్యాష్ మీరు ఇంట్లో ఎందుకు వుంచుకున్నారు? ఏం బ్యాంకిలోనో వేయొచ్చుగా?"

"బ్యాంకిలో వేద్దామనే బీరువాలో దాచాను. ఈ లోపలే యిదంతా జరిగిపోయింది."

"మిష్టర్ రామచంద్రన్, యీనాడు ఎన్నో నేరాలు ప్రజలు అజాగ్రత్తగా వుండడంవలన జరుగుతున్నాయి. ప్రజలు జాగ్రత్తగా వుంటే నేరస్తులు ఏమీ చెయ్యలేరు" అన్నాడు ఇన్స్పెక్టర్ రాకేష్‌శర్మ.

ఇన్స్పెక్టర్ గదిలో పచార్లుచేస్తూ మళ్ళీ రుమాలు వైపు చూశాడు.

"ప్లీస్, రాధికను ఒకసారి పైకి రమ్మనండి!"

లక్ష్మి కిందకు వెళ్ళింది. కాస్సేపట్లో యిద్దరూ పైకి వచ్చారు.

"ఈ రుమాలును ఆమె చేతిలో మీరు చూశారా?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఇది నాది సార్! సాయంత్రం లక్ష్మితో పైకివచ్చినపుడు యిక్కడ వదిలేసి వుంటాను" అందామె దాన్ని తీసుకుంటూ.

"పోలీసు కుక్కకూ, మాకూ శ్రమ తగ్గించారు" అన్నాడు ఇన్స్పెక్టర్ ఆమెవైపు చూస్తూ.

ఇన్స్పెక్టర్‌తో రామచంద్రన్ కిందకు వెళ్ళాడు. జీప్ దగ్గర యిద్దరు కానిస్టేబుళ్ళు వున్నారు.

"ఇన్స్పెక్టర్, తొందరగా యేదో చేసి మా నగలు మాకు అందేటట్లు మీరు చూడాలి!" అన్నాడు రామచంద్రన్.

ఇన్స్పెక్టర్ అతడివైపు చూశాడు.

"రాధిక భర్త వీరేశం ఎక్కడ పని చేస్తున్నాడు?"

"సునీల్ అండ్ సన్స్ కంపెనీలో సేల్స్‌మన్."

"రాధిక యెటువంటిది?"

"రాధిక, భర్త మంచి వాళ్ళు. ఆమెను మీరు అనుమానిస్తున్నారా?"

"అనుమానించాలిగా! యెవరో యింటికి వచ్చారని చెప్పి, ఆమే అంతా చేసి వుండొచ్చుగా!" అన్నాడు యిన్‌స్పెక్టర్.

"ఆమె అలా చేయదు! చాలాకాలంనుంచి వాళ్ళు మాకు తెలుసు."

"ఆల్‌రైట్ చూద్దాం" అని యిన్‌స్పెక్టర్ రాకేష్ శర్మ కానిస్టేబులువైపు చూశాడు.

కానిస్టేబులు జీప్ని పోనిచ్చాడు. రామచంద్రన్ మెల్లిగా మెట్లెక్కి పైకి వెళ్ళాడు. లక్ష్మి పరుపుమీద పడుకుని ఏడుస్తోంది.

3

ఇన్‌స్పెక్టర్ రాకేష్ శర్మ తన మోటార్ సైకిల్ని వేగంగా పోనిచ్చాడు.

అతడిప్పుడు మామూలు దుస్తుల్లో వున్నాడు. డ్యూటీలోలేని సమయాల్లో అతడు పరిశోధన సాగిస్తూ వుంటాడు. అతడొక పోలీసు యిన్‌స్పెక్టరని ఎవ్వరూ తెలుసుకోలేరు.

పాంట్, స్లాక్‌లో రాకేష్ వస్తాదులా కనుపిస్తాడు. అతడు మోటార్ సైకిల్ని ఒకచోట ఆపి దిగాడు. సమీపంలో వున్న మురుగన్ మెడికల్ స్టోర్స్‌వైపు వెళ్ళాడతను.

స్టోర్ యజమాని అతడివైపు నవ్వుతూ చూశాడు, "ఏం కావాలి, సార్?"

"ఇవాళ మధ్యాహ్నం ఒక యువతి యిక్కడినుంచి యెవరికేనా ఫోన్ చేసిందా?"

"లేదు, సార్. యెవ్వరూ ఫోన్ చేయలేదు."

"జ్ఞాపకం తెచ్చుకోండి! మీరు పనిలో వున్నపుడు యెవరైనా వచ్చి వుండొచ్చు!" అన్నాడు రాకేష్.

"ఈ ఫోన్ వారం రోజులనుంచి పనిచేయడంలేదు. కేబుల్ ఫాల్ట్ అని అన్నారు."

"ఆమె వచ్చి మిమ్మల్ని అడిగి వుండొచ్చుగా!"

"ఎవ్వరూ నన్ను అడగలేదు!"

"థాంక్స్" అని అతడు తన మోటారుసైకిల్ వైపు నడిచాడు.

మోటర్ బైక్ పక్కనే నిలబడి అతడు సిగరెట్ వెలిగించాడు. పొగ వదులూ నలువైపులా చూశాడు. అనేక షాపులున్నాయి. రాధిక భర్త రేసింగ్ గైడ్ కొనుక్కొని తన యింటివైపు పోతున్నాడు. అతడు రాకేష్‌ను చూడలేదు.

వీరేశానికి రేసింగ్ పిచ్చి వుందన్నమాట!

రాకేష్ తన మోటర్ సైకిల్ని పోనిచ్చాడు. సునీల్ అండ్ సన్స్ కంపెనీలో తనకు తెలిసిన ఒక వ్యక్తి పనిచేస్తున్నాడు. అతడింటిముందు రాకేష్ మోటర్ బైక్ ఆపి దిగాడు.

"సార్, మీరా?" అన్నాడు రామారావు అతడిని చూసి బయటకొస్తూ.

"రామారావు, మీ ఆఫీసులో పనిచేసే వీరేశం తెలుసా?"

"వీరేశమా? అతనిప్పుడు మైలాపూరు బ్రాంచిలో పనిచేస్తున్నాడు."

"అతడిని గురించి ఏం చెప్పగలవు?"

"సేల్స్‌మన్‌గా మంచి పేరుంది. కాని అప్పులతో పీకదాకా నిండివున్నాడు. గుర్రప్పందాలకు వెళ్ళి డబ్బు పోగొట్టుకుంటూ వుంటాడని అందరికీ తెలుసు."

"అతడు నీకేమైనా బాకీపడ్డాడా?"

"ఒకసారి యాభై రూపాయిలిచ్చాను. అది తిరిగి రాలేదు. వస్తుందనే నమ్మకంలేదు. నన్ను మళ్ళా అతడు అప్పు అడగలేదు."

"అతడికి వేరే చెడ్డ అలవాట్లు వున్నాయా?"

"పేకాడ్తాడు. సిగరెట్లు వూదేస్తాడు. తాగుతాడు ఇవన్నీ సాధారణంగా కలిసే వుంటాయి."

రామారావు, అతడిని నువ్వు కలుసుకుంటే నేను యిదంతా అడినట్లు చెప్పకు!"

"చెప్పను, సార్."

రోడ్డు దీపాలు ప్రకాశవంతంగా వెల్గుతున్నాయి. రాకేష్ మోటర్‌సైకిల్ని వేగంగా పోనిస్తున్నాడు. యెదురుగా టి.వి.ఎస్ 50మీద వస్తూన్న వ్యక్తికి సౌజ్ఞ చేస్తూ అతడు మోటర్‌సైకిలు ఆపాడు.

"హలో, యిన్‌స్పెక్టర్!" అన్నాడు రామచంద్రన్.

"వీరేశానికి మీరు యెప్పుడేనా అప్పుగా డబ్బు యిచ్చారా?"

"ఇచ్చాను. వెయ్యి రూపాయిలు యిచ్చుంటాను. బోనస్ వచ్చాక యిచ్చేస్తానన్నాడు."

రాకేష్ ఆలోచిస్తూ వుండిపోయాడు.

"మీరింకా అతడిని అనుమానిస్తున్నారా?

"అతడు అప్పుల్లో వున్నాడు. రేసుల్లో యెంతో పోగొట్టుకుంటున్నాడు. అటువంటి వాడికి డబ్బు

కావాలిగా?" అడిగాడు రాకేష్.

"అతడికి దొంగ బుద్ధిలేదు, సార్. అడిగి అప్పుగా తీసుకుంటాడు. అతడి భార్య చాలా మంచిది."

"మీరూ అతనూ డ్రింక్స్ సేవిస్తూ వుంటారా?"

"ఆదివారం యిద్దరం కలిసి డ్రింక్స్ తీసుకుంటూ వుంటాం. అతడు రోజూ డ్రింక్ చేస్తాడు. అతడు సేల్స్ మన్ గా! వస్తువులను అతడు క్లయింట్లకు అమ్మేస్తూ వుంటాడు. ఈనాటి వ్యాపారం ప్రతి కంపెనీలోనూ అలాగే సాగుతూ వుంటుంది."

"థాంక్స్, గుడ్ నైట్" అని రాకేష్ తన మోటారు బైక్‌ను పోనిచ్చాడు.

4

తేనాంపేటలోని ఒక కాంపౌండులోకి ఆమె ప్రవేశించింది. ముందు వరండామీద నడిచి హాల్లోకి వెళ్ళింది. హాల్లో వున్న పనిమనిషి ఆమెవంక చూసింది.

"అమ్మ లేరూ?"

"పిల్లలతో ఆమె ఎక్కడికో వెళ్ళారు. తిరిగొచ్చేసరికి రెండవుతుందన్నారు. మీరు ఎవరు?"

"ఈ ఇంటి పిల్లలు చదివే స్కూలు హెడ్‌మిస్ట్రెస్‌ని. అమ్మ నన్ను రమ్మన్నారు. అందుకని వచ్చాను."

"అలా కూర్చోండమ్మా!" అంది నౌఖరు.

ఆమె సోఫాలో కూర్చుంది. పనిపనిషి ఫాన్ స్విచ్ నొక్కింది. ఫాన్ తిరుగుతోంది.

"మంచినీళ్ళు కావాలా?"

"పట్రా."

పనిమనిషి లోపలకు వెళ్ళి రిఫ్రిజిరేటర్‌లోని నీళ్ళ బాటిల్ను తెచ్చి ఆమెకిచ్చింది. ఆమె బాటిల్లోని నీళ్ళను

పూర్తిగా తాగేసింది. బాటిల్ను పనిమనిషికిచ్చింది.

"నువ్వు తప్ప యింట్లో ఎవ్వరూ లేరా?"

"లేరండమ్మా."

"చాలా కాలంనుంచి యిక్కడ పనిచేస్తున్నావా?"

"రెండేళ్ళనుంచి ఇక్కడే వుండాను. తిండికూడా యిక్కడేనమ్మా."

"మంచి యింట్లో పడ్డావు!" అందామె.

"మీ పేరమ్మా?"

"హేమలత."

"అమ్మగారు వచ్చాక మీ గురించి చెప్తాను."

"నేను మళ్ళా యిక్కడకు రాలేను. కొత్త ఎడ్మిషన్లతో తీరిక లేదు. ఆమెనే స్కూలుకి రమ్మను."

ఆమె లేచింది. ధరించిన చీర కిందకు జారిపోతోంది. ఆమె చీరను పట్టుకుని పక్క గదివైపు చూసింది.

"ఆ గదిలోకెళ్ళి చీర సరిగ్గా కట్టుకుంటాను" అందామె.

"కట్టుకోండమ్మా."

ఆమె లోపలకు వెళ్ళింది. తలుపును మూసింది. పదిహేను నిమిషాలు తర్వాత బయటకొచ్చింది, తన హేండ్ బాగ్ తో.

"నువ్వు చాలా మంచిదానవు. నీకెప్పుడేనా పని కావలసివస్తే మా స్కూలుకిరా. ఇక్కడికంటె ఎక్కువ జీతం అక్కడ నీకిస్తాను" అందామె.

"ఈ యిల్లు వదలనమ్మా."

"వదలొద్దు. వ ద ల వ ల సి వ స్తే మా స్కూలుకు గావచ్చు."

"మీ స్కూలు ఎక్కడమ్మా?"

"అదంతా మీ అమ్మకు తెలుసు. నేను వచ్చానని చెప్పు. ఎన్నో పనులుండడంవలన వెళ్ళిపోయానని చెప్పు. ఆమెను తప్పక రమ్మను" అందామె.

"అలాగేనమ్మా."

ఆమె బయటకు వెళ్ళిపోయింది.

రెండింటికి యింటిముందు ఫియట్ కారు ఆగింది. మనోరమ, యిద్దరు పిల్లలు దిగి హాల్లోకి వచ్చారు.

"మీకోసం మిస్సమ్మ వచ్చి వెళ్ళారు" అంది పని మనిషి.

"ఎవరు?"

"హేమలతమ్మగారు. పిల్లలు చదివే స్కూలు పంతు అమ్మ."

"ఆమె ఎవరో నాకు తెలియదు."

"మీరు రమ్మన్నారుట."

"ఎవరో పొరపాటున ఇక్కడకు వచ్చుంటారు" అని ఆమె పడగ్గదిలోకి వెళ్ళింది.

కొంతసేపయ్యాక మనోరమ పడగ్గదిలోంచి "కామినీ!" అని పిల్చింది.

పనిమనిషి పడగ్గదిలో కెళ్ళింది. మనోరమ గాడ్రెజ్ బీరువాముందు నిలబడి వుంది.

"నా నగలు లేవు. ఏమయ్యాయి?" అడిగిందామె.

"ఎవరు ముట్టుకుంటారమ్మా? అక్కడే వుంటాయి, చూడండి!"

వెతుకుతున్నకొద్దీ ఆమెలో గాభరా ఎక్కువైంది.

"డైమండ్ కమ్మలు, రవ్వల హారం, డైమండ్ రింగ్స్, గాజులు అన్నీ పోయాయి."

కామిని నోటమ్మట మాట పెగల్లేదు.

"నాకోసం వచ్చినామె యీ గదిలోకొచ్చిందా?"

"చీర జారిపోతూంటే యీ గదిలోకెళ్ళి ఆమె కట్టుకుందమ్మా" అంది పనిమనిషి.

"అది నాకు ముందే ఎందుకు చెప్పలేదు? నిన్ను నమ్ముకొని యింటికి కాపలా పెట్టి వెళ్తే ఆ దొంగముండని యీ గదిలోకి వెళ్ళనిచ్చావా? దిగజారే చీరను హాల్లోనే నీముందు కట్టుకోవచ్చుగా!" అర్చింది మనోరమ.

"నన్ను క్షమించడమ్మా. నా బుర్రకి అదంతా తట్టలేదు" అంది పనిమనిషి.

"ఆమె వెళ్ళి ఎంతసేపయింది?"

"చాలా సేపయిందమ్మా."

మనోరమ గాభరాగా కారులో కూర్చుంది.

"డ్రయివర్ కాన్వెంట్‌కు పద!" అందామె.

"పిల్లల్ని చూసుకో! ఎవ్వర్నీ లోపలకు పంపకు" అని ఆమె పనిమనిషిని హెచ్చరించింది.

కారు కాన్వెంటువైపు దూసుకుపోయింది. పెద్ద కాంపౌండులో కారు ఆగింది. ఆమె దిగి ప్రిన్సిపాల్ రూముకు వెళ్ళింది.

మిస్ జాన్ మేరీ ఆమెవైపు నవ్వుతూ చూసింది.

"మనోరమగారూ, ఏమిటి సంగతి?" అడిగిందామె.

"మీ స్కూలునుంచి యెవరైనా మా యింటికి వచ్చారా?"

"ఎవ్వరూ వచ్చుండరు. నే వెళ్ళమనలేదు. నేను వెళ్ళమంటేగాని ఎవ్వరూ వెళ్ళరు. ఇదంతా ఎందుకడుగుతున్నారు? ఏమైంది?" ప్రశ్నించిందామె.

జరిగినదంతా మనోరమ చెప్పింది.

"పాపం పెరిగిపోతోంది. ఈ లోకంలో నేరస్తులు

ఎక్కువై పోతున్నారు. మరోసారి జీసెస్ అవతరించి లోకాన్ని బాగుపర్చాలి" అందామె.

మనోరమ కుర్చీలోంచి లేచింది.

"వెంటనే పోలీసు రిపోర్టు యివ్వండి" అని ఆమె సలహా యిచ్చింది.

మనోరమ వెళ్ళి కారులో కూర్చుంది. ఆమె గుండె దడదడలాడ్తోంది.

"డ్రయివర్, యింటికి పద!" అందామె.

కారు దిగి ఆమె హాల్లోకి వెళ్ళింది.

"అ పంతులమ్మ దొరికిందా?" అడిగింది పనిమనిషి.

మనోరమ జవాబివ్వలేదు. టెలిఫోన్ వైపు నడిచి రిసీవర్ ఎత్తింది. ఒక నంబర్ను తిప్పింది.

"హలో. మనోరమా షుగర్ మిల్స్!" అంది టెలిఫోన్ ఆపరేటర్.

"వెంటనే రామరాజా గారితో మాట్లాడాలి."

"ప్లీస్, వుండండి."

మరుక్షణంలో కనెక్షన్ యివ్వబడింది.

"హలో, మనూ!" అన్నాడు రామరాజా.

జరిగినదంతా ఆమె చెప్పింది.

"మనూ, డోంట్ బాదర్! పోయిందేదో పోయింది. ఇలా దొంగతనాలు చేసే ఒక యువతి గురించి యీ మధ్య పేపర్లో చదివాను. యిన్స్పెక్టర్ రాకేష్‌శర్మ ఆమెను గురించి దర్యాప్తు సాగిస్తున్నాడు. అతడికి నేను రిపోర్టిస్తాను. ఏం చేయాలో అతడు చూసుకుంటాడు" అన్నాడు రామరాజా.

"అంత విలువైన నగలు పోయినా మీరు లెక్క చేయడంలేదు!" అందామె.

"మనూ, పోయిందాన్ని గురించి విచారించడంవలన లాభించదు. పోయినదంతా ఒక్క రోజులో నేను గడించగలను. దానికోసం ఏడుస్తూ కూర్చుంటే ఏ పనీ చెయ్యలేను. ఇది నీకూ, నాకూ కూడా వర్తిస్తుంది. కామిన్ని ఎక్కువగా తిట్టకు! ఎవరు యేం చెప్పినా అది నమ్మేస్తుంది. అవొక బిలీవింగ్ యిడియట్!"

"ఆల్ రైట్, అలాగే చేస్తాను" అని ఆమె రిసీవర్ పెట్టేసింది.

5

ఇన్‌స్పెక్టర్ రాకేష్ శర్మ ఏర్ కండిషండ్ గదిలోకి నడిచాడు. స్ప్రింగ్ తలుపు అతడి వెనకనే మూసుకు పోయింది.

రామరాజు అతడితో కరచాలనం చేసి కూర్చొ మన్నాడు.

"మీ లత మళ్ళా మోసం చేసి నగలుపట్టుకుని పారి పోయింది. పేరు కొద్దిగా మారింది. ఆమె హేమలత అయింది" అన్నాడు రామరాజు.

"ఎక్కడ ఏం జరిగిందో చెప్పండి, సార్."

"ఇవాళ ఆమె మా యింటిమీద దాడి చేసింది. ఆ సమయంలో పనిమనిషి కామిని మాత్రం ఇంట్లో వుంది. నా భార్య మనోరమ, యిద్దరు పిల్లలు ఎక్కడికో వెళ్ళారు."

తర్వాత జరిగినది రామరాజు చెప్పాడు.

"గుడ్ గాడ్, చాలా తెలివిగా, ధైర్యంగా ఆమె దొంగతనాలు సాగిస్తోంది" అన్నాడు యిన్‌స్పెక్టర్ రాకేష్ శర్మ.

"ఈసారి ఆమె పట్టుకుపోయిన నగల విలువ లక్ష

రూపాయలు పైన వుంటుంది."

పోయిన నగలలిస్టు కాగితంమీద రాసి అతడు యిన్‌స్పెక్టర్‌కి యిచ్చాడు.

"రామరాజుగారూ, ఒకసారి నేను మీ యింటికి వెళ్ళాలి!"

రామరాజు నవ్వుతూ అతడివైపు చూశాడు.

"అక్కడ మీరు చూడవలసింది ఏమీ లేదు. అయినా సాయంత్రం మామూలు డ్రస్సుల్లో రండి పోలీసు జీప్‌లో వస్తే మా యింట్లో ఏదో జరిగిందని అందరూ అనుకుంటారు. నాకా పబ్లిసిటీ అంటే అంతగా గిట్టదు. పోయింది దొరికితే, గుడ్! దొరక్కపోతే నాకు ఫికార్ లేదు!"

"అలాగే ఐదింటికి వస్తాను. మీరూ వీలైతే అక్కడ వుండండి."

"ఆల్‌రైట్, వుంటాను" అన్నాడు రామరాజు.

ఇన్‌స్పెక్టర్ సెలవుతీసుకొని వెళ్ళిపోయాడు. రామరాజు భార్యకు ఫోన్ చేశాడు.

"మనూ, ఇన్‌స్పెక్టర్ రాకేష్ శర్మ మనింటికి ఇవాళ ఐదింటికి వస్తాడు. మంచి టిఫిన్ రెడీగా వుంచు."

"అలాగే" అందామె.

"అతను మఫ్టీలో వస్తాడు. పోలీసు యిన్‌స్పెక్టర్ అని కామినికి చెప్పకు. చెప్తే అది భయపడుతుంది."

"చెప్పను" అందామె.

"ఆల్‌రైట్, మనూ" అని అతడు రిసీవర్ పెట్టేశాడు.

సరిగ్గా ఐదింటికి మోటర్‌బైక్ యింటిముందు ఆగింది. రామరాజు అతడికి స్వాగతం చెప్పి హాల్లోకి తీసుకెళ్లాడు.

"విత్ ఎట్ హోమ్!" అన్నాడు రామరాజు.

ఇద్దరూ సోఫాల్లో కూర్చున్నారు.

"ఆమె యీ గదిలోనే కూర్చుంది. తర్వాత పడ గ్గదిలోకి వెళ్ళి చీరను సర్దుకుంది."

"పదండి, ఆ గదిలోకి వెళ్దాం" అన్నాడు రాకేష్.

ఇద్దరూ పడగ్గదిలోకి వెళ్ళారు. రాకేష్ గది నలు మూలలా చూశాడు. గాడ్రెజ్ బీరువాను పరీక్షించాడు. యటాచ్డ్ బాత్‌రూంలోకి వెళ్ళాడు. అన్నివైపులా చూశాడు.

"ఆమె యెక్కడా ఏమీ వదలడంలేదు. చాలా జాగ్రత్తగా వుంటోంది" అన్నాడు రాకేష్.

"ఆడవాళ్ళు మొగాళ్ళకంటె తెలివిగా దొంగతనం చేయగలరు!" అన్నాడు రామరాజు.

ఇద్దరూ మళ్ళా హాల్లోకి వచ్చారు. కాస్సేపట్లో మనోరమ గదిలోకి వచ్చింది. రామరాజు ఆమెను రాకేష్‌కి పరిచయంచేశాడు.

"త్వరలో ఆ యువతిని మేం పట్టుకుంటాం. మీరు బెంగెట్టుకోకండి" అన్నాడు రాకేష్.

"చాలా థాంక్స్" అందామె.

"కామిని యిక్కడే వుందా?"

"అది పల్లెటూరిది. దానితో మాట్లాడ్డం మీకు యే విధంగానూ వుపయోగపడదు. అంతే కాదు. దానికి పోలీసులంటే వల్లమాలినంత భయం" అన్నాడు రామ రాజు.

"నేను పోలీసు యిన్‌స్పెక్టర్‌గా లేనుగా! ఒకసారి పిలవండి. మాట్లాడి చూస్తాను."

మనోరమ పిలవగానే కామిని గదిలోకొచ్చింది.

"ఈయన నా ఫ్రెండు రాకేష్" రామరాజు ఆమెతో చెప్పాడు.

"నమస్కారాలు అయ్యా" అంది కామిని.

"ఇక్కడికొచ్చిన యువతి ఎలా వుంటుంది?"

"పెద్దింటి పిల్లలా వుందయ్యా. చక్కటి చుక్కలా వుంది. నాకు ఉద్యోగంకూడా యిస్తానంది. నేనీ యిల్లు వదలనన్నాను."

"ఆ గదిలో ఆమె ఎంత సేపుంది?" అడిగాడు రాకేష్.

"ఎక్కువసేపే వుందయ్యా."

"ఆమెను ఎక్కడేనా చూస్తే పోల్చగలవా?"

"పోల్చగలనయ్యా."

రామరాజు సోఫాలోంచి లేచాడు.

"రాకేష్, మా యింటికి మీరు రావడం యిదే మొదటిసారి. డైనింగ్ హాల్లోకి వెళ్ళి టిఫిన్ తిందాం, పదండి" అన్నాడు రామరాజు.

కామిని వెళ్ళిపోయింది. రామరాజు, రాకేష్ లోపలున్న డైనింగ్ హాలువైపు నడిచారు. ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. అనేక పదార్థాలు ప్లేట్లలో టేబులుమీద పెట్టబడి వున్నాయి.

"రాకేష్, ఆ యువతిని కాస్సేపు మర్చిపోయి మెల్లిగా టిఫిన్ సేవించుదాం" అన్నాడు రామరాజు.

6

బస్సు పక్కనుంచి టాక్సీ దూసుకుపోయింది. బస్సులో కూర్చున్న సుబ్బారావు టాక్సీలో కూర్చున్న యువతిని చూసి వులిక్కిపడ్డాడు.

ఆమెను చూసి చాలా కాలమైంది. రెండేళ్ళపైగా ఆమెకోసం అతడు వెతుకుతున్నాడు. ముందు వెళ్తూన్న

టాక్సీవైపే అతడు చూస్తున్నాడు. టాక్సీ యింకా కనబడ్తోంది. కాని బస్సులో తను ప్రయాణం చేస్తే టాక్సీ యెక్కువసేపు కనబడకపోవచ్చు.

బస్సు ఆగగానే అతడు దిగాడు. పక్కనుంచి పోతున్న ఆటోలో కూర్చుని వేగంగా వెళ్ళమని డ్రైవర్ని హెచ్చరించాడు.

ఆటో వెళ్తోంది. దూరంలో టాక్సీ కనిపిస్తోంది.

"ఇంకా వేగంగా పోనీ!" అర్చాడతను.

"ఎక్కడికెళ్ళాలి?" అడిగాడు డ్రయివర్.

"ఆ టాక్సీ వెనకనే పోనీ!"

ఇప్పుడు టాక్సీకి ఆటో దగ్గరైంది. ఆ టాక్సీలో వున్నది నిజంగా ఆమేనా, కాదా?

పెద్ద హోటల్ కాంపౌండులోకి టాక్సీ వెళ్ళింది. పోర్టికోలో ఆగింది. ఆమె దిగి హోటల్లోకి నడిచింది.

అతడు ఆటోలోంచి దిగాడు. వేగంగా లోపలకు వెళ్ళాడు. ఆమె మెట్లెక్కి పైకి వెళ్తోంది. కొంచెం దూరంలో ఆమెను అతను వెంబడించాడు.

వెనకనుంచి ఆమెను గమనిస్తున్నాడు. సందేహం లేదు. ఆమే!

నడవమ్మట నడిచి ఒక గది తాళం తెర్చి ఆమె లోపలకు వెళ్ళి తలుపు మూసుకుంది. అతడు పెద్ద అంగల్లో అదే గదిముందుకు వెళ్ళాడు.

నడవాలో కాస్సేపు ఆలోచిస్తూ ఉండిపోయాడు. తన్ని చూసి ఆమె ఏమనుకుంటుంది? తన్ని బంతిలా విసిరి కొట్టింది. ఇప్పుడతను మళ్ళా ఆమె ముందుకు వెళ్తే ఏమంటుందో!

అతడు ధైర్యం చేసి తలుపును తట్టాడు. ఆమె తలుపు

తెర్చి అతడివైపు ఆశ్చర్యంగా చూసింది. ఆమె ముఖంలో నవ్వులేదు. కోపం లేదు.

"నువ్వింకా బతికే వున్నావా?" అడిగిందామె.

"చచ్చాననుకున్నావా?" అడిగాడతను.

అతడు గదిలోకి దూరాడు. తలుపును మూశాడు. ఆమె సోఫాలో కూర్చుంది. గ్లాసులోని స్కాచ్ విస్కీని తాగింది. టీపాయిమీద స్కాచ్ విస్కీ బాటిలుంది.

"తాగుతావా?" ప్రశ్నించిందామె.

"నాకా అలవాటు లేదు."

ఆమె పరిహాసంగా అతడివైపు చూసింది.

"నీది చీమ బతుకు. నెలకు మూడొందలు గడిస్తావు. అర్ధాకలిగా తిండి తింటావు. మాసిన గుడ్డలతో భార్య పక్కనే పడుకుంటావు. నీ దుర్వాసనకి హృదయంలోని ప్రేమ హరించి పోతుంది. డర్టీ బెగ్గర్లీ లైఫ్!" అందామె.

అతడు మౌనంగా వుండిపోయాడు.

ఆమె మునపటిలా లేదు. ఖరీదైన దుస్తులు. ఒంటినిండా నగలు! ఇవన్నీ ఆమెకెలా వచ్చాయి? ఆమె ఏం చేస్తోంది?

గ్లాసులో ఆమె మళ్ళా స్కాచ్ పోసుకుంది. సోడా కలిపి ఐస్‌క్యూబ్స్ వేసింది. కొంచెం తాగి అతడివైపు చూసింది.

"రియల్ లైఫ్ అంటే యిది! ప్రతిక్షణంలోనూ ఒక వింత అనుభవం! ఒక థ్రిల్! నువ్వు యిక్కడికెందుకొచ్చావు?"

"నిన్ను యింటికి తీసుకెళ్ళడానికి."

"ఆ యమ కూపంలోకి నేనీ జీవితంలో రాను. శాశ్వతంగా గుడ్‌బై చెప్పేశాను" అందామె.

"ఈ గది స్వర్గంలా కనిపిస్తే నీతో నేనూ ఇక్కడే వుంటాను" అన్నాడతను.

"నువ్విక్కడ రాణించవు. ఎలక్ట్రాన్నంలో బతకడం నీకు అలవాటైపోయింది. అక్కడి సుఖం నీకిక్కడ దొరకదు!" అందామె ఆక్షేపణగా.

"నువ్వు ఆనందంగా వుంటే నాకు చాలు. నువ్వు ఏం చేసినా నేను ఏమీ అనను. నీ యిష్టమొచ్చినట్లు నువ్వు బతకొచ్చు" అన్నాడతను.

"నాకు దూరంగా వుండడం నీకంత కష్టంగావుందా?"

"చాలా బాధకరంగా వుంది. నీకోసం వెతుకుతూ నేను జీవిస్తున్నాను. ఎప్పుడో ఎక్కడో నువ్వు కనబడ్తావని నా విశ్వాసం. అలాగే యివాళ కనపడ్డావు."

"నిన్ను చూస్తే జాలివేస్తుంది. ఐ పిటీ యూ!" అందామె.

"నామీద ఆమాత్రం జాలి నీలో మిగిలినందుకు సంతోషిస్తున్నాను."

"నా అడ్వంచర్స్ గురించి వింటే నువ్వు నాతో వుండడానికి భయపడ్తావు!"

"నీ జీవితం గురించి చెప్పు. వింటాను ఆత్రంగా."

"పత్రికల్లో నువ్వు చదివే వుంటావు. లత, హేమలత!" అందామె.

అతడు తృళ్ళిపడ్డాడు. ఆమె వైపు గాభరాగా చూశాడు.

"అదంతా నువ్వే చేశావా? నేను నమ్మను. అంత ధైర్యం నీకెలా వచ్చింది?" అడిగాడతను.

"నీకు దూరంగా పోతే ప్రతి మనిషి ధైర్యవంతు

డవుతాడు. పిరికిపందలమధ్య జీవించడం మనిషికి మంచిది కాదు."

"ఇంతవరకూ అయిందేదో అయింది. ఇటుపైన అటువంటి జీవితం మానేయి. జైలు పాలవుతావు. తర్వాత విచారిస్తావు!"

ఆమె పకపక నవ్వింది.

"నన్నెవరూ పట్టుకోలేరు! నే నెవ్వరికీ దొరకను!"

"ఈనాడు నాకు కనిపించినట్లే మరెవరికో కనపడొచ్చు. వాళ్ళు నిన్ను పోలీసులకు పట్టిస్తారు."

"అది నువ్వే చేయొచ్చుగా!" అందామె.

"అది నేను చెయ్యను."

"తర్వాత నీ ఆలోచనలు మారొచ్చు. నన్ను పట్టిసే ఐదువేలు బహుమతిగా యిస్తామని ప్రకటించారు. పత్రికల్లో చూశావా?"

"చూశాను. నా మాట విను. మనిద్దరం ఈ పట్నం వదిలి యే బొంబాయో పోదాం. అక్కడ సుఖంగా బతకొచ్చు."

"అందులో సుఖంలేదు. నాకిదే నచ్చింది. యే క్షణంలో ఏమవుతుందో తెలియదు. రియల్ ఎడ్వంచర్!" అందామె.

అతడు ఆమెవైపు సూటిగా చూశాడు.

"రెండేళ్ళ తర్వాత నువ్వు కనబడ్డావు. నన్ను వచ్చి నీతో వుండమంటావా?"

"ఆలోచించి రేపు చెప్తాను. రేపు సరిగ్గా పదింటికి యిక్కడకు రా!"

అతడు సంశయిస్తూ వుండిపోయాడు.

"రేపు నేను వచ్చేసరికి నువ్వు ఇక్కడ వుంటావా?"

ఆమె కిలకిల నవ్వింది.

"వుంటానని నమ్మి వెళ్ళు! నేను లేకపోతే నాకోసం వెతుకు! నీ జీవితం చాలా థ్రిల్లింగ్‌గా వుంటుంది!" అందామె.

"రేపు వస్తాను" అని అతడు గదిలోంచి బయటకు నడిచాడు.

7

ఆ రాత్రి సుబ్బారావుకు నిద్రపట్టలేదు. జాగారం చేస్తూ తన గదిలో కూర్చున్నాడు.

గదిలో ఫ్లోరసెంట్ లైటు వెలుగుతోంది. కుర్చీలో కూర్చుని తన గతాన్ని అతడు జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాడు.

పెళ్ళినాటికి జయ వయస్సు ఇరవైఒకటి వుంటుంది. తనలా ఆమె కూడా బి.ఎ. పాసయ్యింది. తను ఒక పబ్లిషింగ్ కంపెనీలో మేనేజర్‌గా వుంటున్నాడు. పెళ్ళి అయ్యాక అతడు భార్యను మద్రాసు తీసుకొచ్చాడు. తనకొచ్చే మూడువందలమీద వాళ్ళు జీవించేవారు. డబ్బు విషయంలో అతడు చాలా జాగ్రత్తగా వుండేవాడు.

ఒకనాడు ఆఫీసునుంచి అతడు యింటికి తిరిగివచ్చాడు. ఆమె యింట్లో లేదు. తలగడకింద ఆమె ఉత్తరం దొరికింది.

"సుబ్బారావ్,

నీతో గడిపిన సంవత్సరం ఎలా గడిచిందో అని నాకు ఆశ్చర్యంగా వుంది. ఈ చీమ బతుకుతో నాకు విసుగెత్తుతోంది. ఒక్క క్షణం కూడా యింక యిక్కడ వుండలేను. నన్ను మర్చిపో!

నాకు థ్రిల్, అడ్వెంచర్ కావాలి. తీగమీద నడిచినట్లు వుండాలి జీవితం. కింద పడ్తానేమో అనే భయం, నడవగలననే ధైర్యం నాకెంతో థ్రిల్ని యిస్తాయి. ప్రేమనే పాశానికి బలై నీ జీవితం పాడుచేసుకోకు!

గుడ్ లక్ అండ్ గుడ్ బై!

జయ."

ఆ ఉత్తరాన్ని అతడు ఎన్నిసార్లు చదివాడో లెక్క లేదు. వారం రోజులపాటు అతడామెకోసం పట్నమంతా పిచ్చిగా వెతికాడు. ఆమె ఎక్కడా కనపడలేదు.

కాకినాడకు టెలిగ్రామ్ పంపాడు. ఆమె అక్కడకు రాలేదని వాళ్ళు టెలిగ్రామ్‌ద్వారా తెలియజేశారు. తలిదండ్రులున్న కాకినాడకు జయ వెళ్ళలేదు. ఆమె ఎక్కడకు పోయింది? ఆమె ఎలా బతుకుతుంది?

జయ అందమైన యువతి. ఎవరో ఆమెను నమ్మించి మోసం చేయెచ్చు. ఇదంతా వూహించుకుని అతడు బాధపడేవాడు.

ఒకరోజు కంపెనీ యజమాని అతడిని పిల్చి వార్నింగ్ యిచ్చాడు.

"సుబ్బారావు, నువ్వు మునపటిలా వుషారుగా పని చేయడం లేదు. నీ భార్య యిల్లు వదిలి యెక్కడకో పోయిందని చెప్పావు. ఆమెను గురించి ఆలోచించి నీ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నావు. మా కంపెనీ పని వెనకబడ్తోంది. ఇలా యింకా కొంతకాలం సాగితే మరో మేనేజర్ని మేం పెట్టుకోవలసి వస్తుంది."

"వద్దు సార్, ఇటుపైన సవ్యంగా పనిచేస్తాను" అని అతడు హామీ యిచ్చాడు.

ఆటు పైన రాత్రి కొంతసేపు పనిచేసి కంపెనీ వర్క్ వెనకపడకుండా అతడు జాగ్రత్తపడ్డాడు. కాని అతడు జయను మర్చిపోలేకపోయాడు. ఆమెను గురించే కలలు కనేవాడు. తొందరపడిపోయినా ఆమె తర్వాత తిరిగి రావచ్చని ఆశించేవాడు.

గతంలోంచి అతడు మేలుకొని జయ ఫోటో వైపు చూశాడు. ఆమె చాలా మారిపోయింది.

సరిగ్గా పదింటికి అతడు ఆమె హోటల్ కు చేరుకున్నాడు. గది ముందుకు వెళ్ళి తలుపును తట్టాడు. కాని జవాబు లేదు.

అతడు కిందకు పరుగెత్తాడు. రిసెప్షన్ గుమస్తా ముందుకు వెళ్ళాడు.

"రూమ్ నంబర్ యాభైలో వుండే ఆమే ఏమైంది?" ప్రశ్నించాడతను.

"నిన్న రాత్రి ఆమె గది ఖాళీచేసి వెళ్ళిపోయింది" అన్నాడతను.

సుబ్బారావు బయటకు నడిచాడు. తను అనుకున్నట్లే అయింది. జయను ఎవ్వరూ నమ్మలేరు. అతడి కళ్ళు నీళ్ళతో నిండాయి.

ధైర్యం తెచ్చుకుని అతడు తన ఆఫీసుకు చేరుకున్నాడు. టైపిస్టు రేఖ అతడివైపు నవ్వుతూ చూసింది.

"ఏమిటలా వున్నారు?" అడిగిందామె.

"ఏమీ లేదు" అన్నాడతను.

"సుబ్బారావుగారూ, జీవితాన్ని బాగుచేసుకోడం పాడుచేసుకోడం మీ చేతుల్లో వుంది. అవకాశమిస్తే మిమ్మల్ని నేను ఎంతో క్షేమంతో చూడగలను" అందామె.

"ఆ అవకాశం దైవం యివ్వాలి నీకు! ఏమవుతుందో చూద్దాం" అన్నాడతను.

"మీకు ఆనందాన్ని యివ్వమని దేవుడిని ప్రార్థిస్తున్నాను" అంది రేఖ.

8

నాలుగో అంతస్తులో వున్న ఫ్లాట్ ముందు గుమ్మం వైపు ఆమె నడిచింది. ఫ్లాట్ M—2

తలుపు మూసి వుంది. ఆమె బెల్ నొక్కింది. ఒకతను తలుపు తెర్చి ఆమెవైపు నవ్వుతూ చూశాడు.

గుండు చేయించుకున్న తల. కళ్ళు లుంగీ ధరించాడతను. పొట్టిగా, సన్నగా వున్నాడు. అతడివైపు ఆమె చూసింది.

"శకుంతల వుందా?" అడిగిందామె.

"మీరెవరు?" అడిగాడతను.

"నా పేరు ప్రేమలత. శకుంతలా, నేనూ బి.ఎ.లో క్లాస్‌మేట్సుం."

"రండి లోపలకు" అన్నాడతను.

ఆమె లోపలకు వెళ్ళింది. సోఫాలో కూర్చుంది.

"మీ గురించి ఆమె నాకు చెప్పింది. మీ పేరు మేనకని ఆమె చెప్పినట్లు నాకు జ్ఞాపకముంది" అన్నాడతను.

ఆమె నవ్వింది.

"మేనక మా క్లాస్‌మేట్. శకుంతల నా గురించి మీకు చెప్పలేదేమో!"

"శకుంతల పుట్టింటికి వెళ్ళింది. ఎల్లుండి సాయంత్రం వస్తుంది" అన్నాడతను.

"ఇల్లక్! ఆమెను చూసి చాలా కాలమైంది. యేదో

పనిమీద యిలా మద్రాసు వచ్చాను. ఆమెను చూడకుండా వెళ్ళడం నాకిష్టంలేదు" అందామె.

"ఆమెను చూసే వెళ్ళండి. ఆమె వచ్చినదాకా మీరు యిక్కడే వుండొచ్చు. మా ఫ్లాట్ పెద్దది—రెండు బెడ్ రూమ్స్ వున్నాయి. నేను వంటచేయడంలో భీముడిలాంటి వాడిని" అన్నాడతను.

నవ్వుతూ ఆమె అతడివైపు చూసింది. గుండెలమీద, చేతులమీద బొచ్చు బాగా వుంది.

"నేను పెళ్ళికాని పిల్లను. ఒంటరిగా యిక్కడ వుండలేను. ఎల్లుండి వస్తాను" అందామె.

"ఇది పట్నం. ఈ ఫ్లాట్‌లో యెవరున్నారో పక్కవాళ్ళు పట్టించుకోరు. ఎవరి గొడవ వాళ్ళదే! మీరు యిక్కడే వుండొచ్చు."

"మీరు అంతగా చెప్పాక ఉండక తప్పదు" అందామె.

అతడు వుషారుగా ముందు తలుపు మూశాడు.

"మీకు కాఫీ తెస్తాను" అని వంటింట్లోకి వెళ్లాడు.

కాస్సేపట్లో హాట్ కాఫీ తెచ్చి ఆమెకిచ్చాడు.

ఆమె థాంక్స్ చెప్పి కాఫీ తాగింది.

"బెస్టు కాఫీ! అఖండంగా వుంది" అందామె.

"నేను తయారుచేసే డిన్నర్ యింకా బాగుంటుంది" అన్నాడతను.

"మీలాంటి భర్త నా ఫ్రెండ్ శకుంతలకు దొరికినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను" అందామె.

"మా యింట్లో రెండు పూటలూ నేనే వంట చేస్తాను. హాయిగా పత్రికలు చదువుకుంటూ శకుంతల కూర్చుంటుంది" అన్నాడతను.

"శకుంతల వెరీ లక్కీ!" అందామె.

ఆమె గదినలువైపులా చూసింది. ఒక టేబుల్ మీద మెక్ డోవెల్స్ విస్కీ బాటిల్, గ్లాసు వున్నాయి.

బాటిల్ వైపు ఆమె చూడ్డం అతడు గమనించాడు.

"మా తండ్రిగారు ఆర్మీలో పని చేసేవారు. బీరుమీద మమ్మల్ని పెంచారు అందువలన ప్రతిరోజూ నేను డ్రింక్ చేస్తూ వుంటాను." అన్నాడతను.

"దానికేముంది. నేను కూడా అలాగే బీర్ మీద పెరిగాను. నా తండ్రి ఏర్ ఫోర్స్‌లో వున్నారు. మా యింట్లోని ఆడవాళ్ళందరూ విస్కీ, జిన్, బ్రాందీ సేవిస్తూనే వుంటారు" అందామె.

అతడు వుషారుగా ఆమెవంక చూశాడు.

"మీరు విస్కీ తీసుకుంటారా?"

"తీసుకుంటాను" అందామె.

"మీరు మీ సూట్ కేసు ఆ గదిలో పెట్టుకోండి. వెళ్ళి స్నానం చేసిరండి" అన్నాడతను.

ఆమె గదిలోకి వెళ్ళింది. తలుపు మూసుకుంది. అర గంట తర్వాత మేక్సీ ధరించి ఆమె హాల్లోకొచ్చింది.

అతడు వంటింట్లో బిజీగా వున్నాడు. కొంత సేపయ్యాక అతడు హాల్లోకొచ్చాడు. ఆమెవంక నవ్వుతూ చూశాడు.

"యూ ఆర్ లవ్ లీ!" అన్నాడతను.

రెండు గ్లాసుల్లో అతడు విస్కీ పోసి, సోడా కలిపి, ఐస్ క్యూబ్స్ వేసి ఒక గ్లాసును ఆమెకిచ్చాడు.

"చియర్స్!" అన్నాడతను.

"చియర్స్!" అందామె.

"కాస్సేపట్లో గ్లాసులు ఖాళీ అయ్యాయి.

అతడు గ్లాసుల్లో మళ్ళా విస్కీ పోశాడు. సోఫా

లోంచి తేచి ఆమె అతడిపక్కకు వెళ్ళింది. ఇద్దరూ గ్లాసులను అందుకున్నారు.

"మీ పేరు చెప్పలేదు!" అందామె.

"వేణుగోపాల్" అన్నాడతను.

ఇద్దరూ విస్కీ తాగేశారు. అతడు వంటింట్లోకి వెళ్ళాడు. కాస్సేపట్లో తిరిగి వచ్చాడు.

గ్లాసుల్లో విస్కీ పోసి ఆమె రెడీగా వుంచింది.

"కనీసం యీ పని నేను చేస్తాను" అందామె.

"వంట పూర్తయింది" అన్నాడతను.

హాల్లో లైట్లు వెలుగుతున్నాయి. ఆమె నిషాతో సోఫాలో కూర్చుంది. అతడు మెల్లిగా వెళ్ళి ఆమె పక్కనే కూర్చున్నాడు.

ఆమెవైపు చూశాడతను.

"ఇంత అందంగా వున్న మీకు యింతవరకూ పెళ్ళవకుండా ఎలా వుంది?"

"నా హేబిట్స్! నేను చాలా ముందుకు పోయిన యువతిని. తాగుతాను. సిగరెట్ కాలుస్తాను. అదంతా మెచ్చుకునే వ్యక్తి కావాలి" అందామె.

అతడు ఆమెకు సిగరెట్ ఇచ్చాడు. ఇద్దరూ సిగరెట్లు వెలిగించారు.

"నా పెళ్ళిముందు మీరు నాకు కనిపించివుంటే!" అని ఆగాడతను.

"ఏం చేసేవారు?" అడిగిందామె.

"మిమ్మల్ని పెళ్ళాడేవాడిని!" అన్నాడతను.

ఆమె మౌనంగా వుండిపోయింది.

"బెటర్ లేట్ దెన్ నెవ్వరు అన్నారు పెద్దలు. ఐ లవ్ యూ!" అన్నాడతను.

"నేను తప్పక మిమ్మల్ని పెళ్ళాడేదాన్ని. కాని శకుంతల నా ఫ్రెండ్. ఆమెకు ద్రోహం చెయ్యలేను" అందామె.

గ్లాసులోని విస్కీ అయిపోయింది.

"మరో రౌండ్ వేద్దామా?" అడిగాడతను.

"లాస్టు రౌండ్!" అందామె.

అతడు విస్కీ పోసి ఆమెకిచ్చాడు. అతడు బాగా నిషాలో వున్నాడు. ఇద్దరూ తాగుతూ, సిగరెట్ పొగ పీల్చి వదుల్తూ కూర్చున్నారు.

పదింటికి యిద్దరూ భోజనం చేశారు.

"మీ వంట అఖండంగా వుంది" అందామె.

"తనివితీరా తినండి" అన్నాడతను.

భోజనాలు అయ్యాక ఆపిల్ పళ్ళు కోసి ప్లేటులో పెట్టి అతడామెకిచ్చాడు.

"హెల్తుకు మంచిది, తినండి" అన్నాడతను.

ఇద్దరూ ఆపిల్ ముక్కలు తింటూ కూర్చున్నారు.

ఆవులిస్తూ ఆమె సోఫాలోంచి లేచింది.

"పడగ్గది తలుపు మూసుకోకుండా పడుకుంటాను" అందామె.

"పడుకోండి. భయంలేదు" అన్నాడతను.

ఆమె అతడికి "గుడ్ నైట్" చెప్పి గదిలోకి వెళ్ళిపోయింది. పరుపుమీద పడుకుంది. ఫ్లాట్‌లోని లైట్లన్నీ ఆరిపోయాయి.

ఆమె పక్కకు దొర్లింది. యెవరి శరీరమో ఆమెకు తగిలింది.

"ఎవరు?" అందామె.

"నేనే, గోపాల్‌ని" అన్నాడతను.

"ఇది శకుంతల చూస్తే నన్ను మన్నించదు!"

ఆమె పుట్టింట్లో వుంది. ఆమె చూడలేదు."

ఆమెమీద అతడు చెయ్యి వేశాడు. ఆమెను దగ్గరకు లాక్కొని పెదిమలను ముద్దెట్టుకున్నాడు.

"ప్లీస్, నన్ను బలాత్కరించకండి!" అందామె.

"అలా యెన్నడూ జరగదు. మీ అంగీకరంతోనే అంతా జరుగుతుంది.

అతడి ఛాతీ మీదున్న బొచ్చును. ఆమె నిమిరింది.

"నా కింతవరకూ ఏ పురుషుడితోటీ సంపర్కంలేదు. రేపు రాత్రివరకూ నాకు టైము యివ్వండి. నేనేదో నిశ్చయించుకుంటాను. మీలాంటివాడికి దూరంగా వుండడం కష్టమే" అందామె.

"మీ యిష్టం. అయితే నేను వెళ్ళి పడుకుంటాను. ఈ రాత్రే మీరు నిశ్చయించుకోగల్గితే నా గదికి వచ్చేయండి. తలుపులు తెర్చివుంటాయి" అన్నాడతను.

అతడు తన గదికి వెళ్ళిపోయాడు. ఆమె కాస్సేపట్లో నిద్రపోయింది. రాత్రి రెండింటికి ఆమె లేచింది. అతడి గదిలోకి వెళ్ళింది. అతడు గాఢనిద్రలో వున్నాడు.

గదిలో వున్న బీరువావైపు ఆమె నడిచింది. ఇరవై నిమిషాలు తర్వాత ఆమె తన గదికి చేరుకుంది. వెంటనే నిద్రపోయింది.

పక్క గదిలో పడుకున్న వేణుగోపాల్ గుర్రు సముద్రపు హోరులా ఫ్లాట్‌లో ధ్వనిస్తోంది.

9

పోస్టులో వచ్చిన కవరును యిన్‌స్పెక్టర్ రాకేష్‌శర్మ చింపి లోపలున్న ఫోటోవైపు చూశాడు. ఎవరు ఆమె?

కవరులో వున్న ఉత్తరం కిందపడింది. అతడు ఆత్రంగా వుత్తరం చదివాడు.

"ఇన్‌స్పెక్టర్,

ఈ పట్నంలో లత, హేమలత, ప్రేమలత అనే పేర్లతో ఒక స్త్రీ ఎన్నో దొంగతనాలు చేసింది. ఆమె ఫోటో యిది. ఒకప్పుడు ఆమెతో నాకు సంబంధం వుండేది. ఆమె నన్ను వదిలి వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఈ నేరాలు చేయడం మొదలెట్టింది. ఈ పట్నంలోని ప్రజలు క్షేమంగా వుండాలనే ఉద్దేశంతో ఆమె ఫోటో మీకు పంపుతున్నాను.

ఆకాశరామన్న."

వుషారుగా రాకేష్ బెల్ నొక్కాడు. ఒక కానిస్టేబుల్ లోపలకు వచ్చాడు.

"జీవ్ రెడీగా వుంచు, వెళ్ళాలి" అన్నాడతను.

ఇన్‌స్పెక్టర్ రాకేష్ జీవ్ రాధిక యింటిముందు ఆగింది.

రాధిక ఫోటోవైపు చూసింది.

"ఈమే యిక్కడకు వచ్చింది" అందామె.

కాస్సేపట్లో పోలీసు జీవ్ రామరాజు కాంపౌండులో ఆగింది. పోలీసులను చూసి కామిని వులిక్కి పడింది. ఫోటోవైపు ఆమె పరీక్షగా చూసింది.

"ఇక్కడకు వచ్చినది యీమే!" అంది పనిమనిషి కామిని.

వేణుగోపాల్ ఫోటోను చూసి ఆమెను పోల్చాడు.

పోలీస్ జీవ్ శరవేగంగా వెళ్ళిపోయింది.

ప్రతి పోలీసుస్టేషన్‌కు ఆమె ఫోటో పంపబడింది. అన్ని పత్రికల్లోనూ ఆమె ఫోటో ముద్రించబడింది.

"త్వరలో ఆమె మనకు దొరుకుతుంది" అన్నాడు రాకేష్‌శర్మ విలేఖర్లతో మాట్లాడుతూ.

* * *

సుబ్బారావు ఆమెవైపు నవ్వుతూ చూశాడు.

"రేఖా, నిన్ను పెళ్ళాడ్డానికి నిశ్చయించుకున్నాను" అన్నాడతను.

"చాలా సంతోషం" అందామె.

"నా భార్యనుంచి విడాకులు తీసుకున్నాక నిన్ను పెళ్ళాడ్తాను. అంతవరకూ నువ్వు వేచివుండగలవా?" అడిగాడతను.

"మీకోసం ఎంతకాలమైనా వేచివుండగలను" అంది రేఖ.

అతడామె చెయ్యి పట్టుకున్నాడు. మెల్లిగా నిమిరాడు. ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు.

"రేఖా, పందులముందు ముత్యాలు పడేసినట్లు అనర్హురాలైన స్త్రీని ప్రేమించడం వ్యర్థమని నీనుంచి నేను నేర్చుకున్నాను. నీకు చాలా థాంక్స్" అన్నాడతను.

"మీనుంచి నేను నేర్చుకోవలసింది యెంతోవుంది" అంది రేఖ.

"నేర్పడం, నేర్చుకోడం రెండూ చేయెచ్చు మనం యిటుపైన" అన్నాడతను.

* * *

రాజేశ్వరరావు దినపత్రికలోని ఫోటో చూసి ఉలిక్కిపడ్డాడు.

తన భార్యను పిల్చాడు. రజని పరుగెత్తుకొచ్చింది.

"ఈ ఫోటోను చూడు" అన్నాడతను.

"మనింట్లో వుంటున్న ఆమెదే!" అందామె.

అతడు కుర్చీలోంచి లేచాడు. మెట్లెక్కి పైకి వెళ్ళాడు. హాల్లో కూర్చుని ఆమె స్కాచ్ విస్కీ సేవిస్తోంది. అతడామెవైపు చూశాడు.

"మేడమీది ఫ్లాట్ మీకు సౌకర్యంగా వుందా?" అడిగాడతను.

"చక్కగా వుంది" అందామె.

అతడివైపు ఆమె చూసింది.

"కొంచెం విస్కీ తాగుతారా?" అడిగిందామె.

"నా భార్య తిడుతుంది" అన్నాడతను.

"డోంట్ బాదర్! ఆమె ఏమీ అనకుండా నేను చూస్తాను" అందామె.

"ఇప్పుడే వస్తాను, వుండండి." అని అతడు బయటకు నడిచాడు.

మెట్లపైనున్న తలుపు మూసి బయట తాళం వేశాడు. ఆమె మేడమీద యిరుక్కుపోయింది. యెక్కడకూ పోలేదు!

అతడు కిందకు దిగాడు. ఇన్‌స్పెక్టర్ రాకేష్‌శర్మకు ఫోన్ చేశాడు.

"హలో, రాకేష్" అందో కంఠం అటువైపునుంచి.

"ఇన్‌స్పెక్టర్ సాయంత్రం దినపత్రికలో వచ్చిన లత ఫోటోను చూశాను. ఆమె మా యింట్లో మేడమీద వుంటోంది. మేడమెట్లు పైనున్న తలుపుకు తాళం వేశాను. ఆమె ఎక్కడకూ పారిపోలేదు. మీరు వెంటనే రండి" అన్నాడతను.

"మీ అడ్రెస్ చెప్పండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

రాజేశ్వరరావు అడ్రెసు చెప్పాడు.

"వస్తున్నాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

* * *

ఆమె నిషాలో వుంది. బాల్కనీలో నిలబడి కిందకు చూస్తోంది. పోలీసు జీపు వచ్చి యింటి ముందు ఆగింది.

ఆమె వేగంగా లోపలకు పరిగెత్తింది.

ఇన్‌స్పెక్టర్ రాకేష్‌శర్మతో రాజేశ్వరరావు కరచాలనం చేశాడు.

"పదండి పైకి వెళ్దాం" అన్నాడతను.

ఇన్‌స్పెక్టర్, రాజేశ్వరరావు, ఇద్దరు కానిస్టేబుళ్ళు మెట్లెక్కి పైకి వెళ్ళారు. రాజేశ్వరరావు తాళం తెరిచాడు. అందరూ వేగంగా హాల్లోకి వెళ్ళారు. అక్కడ యెవ్వరూ లేరు. పక్కనున్న పడగ్గదిలోకి వాళ్లు వెళ్ళారు.

పరుపుమీద ఆమె పడుకుని వుంది. ఇన్‌స్పెక్టర్ మంచం దగ్గరగా వెళ్ళాడు.

"బాగా తాగి ఆమె నిద్రపోయి వుంటుంది" అన్నాడు రాజేశ్వరరావు.

ఇన్‌స్పెక్టర్ రాకేష్‌శర్మ ఆమెవైపు సూటిగా చూశాడు. అనుమానంతో ఆతడామె నుట్టుకు చూశాడు. నాడి కొట్టుకోడంలేదు.

"ఆమె మరణించింది" అరిచాడు రాకేష్.

"ఇంపాసిబుల్" అన్నాడు రాజేశ్వరరావు.

పై నుంచి పోలీస్ జీప్‌ను ఆమె చూసి వుంటుంది. పోలీసులకు చిక్కకూడదనే వుద్దేశంతో

ఆమె ఏదో మింగి మరణించి వుండాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

అందరూ మౌనంగా నిలబడి పరుపుమీద పడుకున్న ఆమెవైపు చూశారు.

"అందమైన రూపం! తన జీవితాన్ని ఆమె చేతులారా నాశనం చేసుకుంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఫ్లాటంతా కానిస్టేబుళ్ళు వెతకడం మొదలెట్టారు. ఇన్‌స్పెక్టర్ రాకేష్ పోలీసు డాక్టర్ కోసం ఫోన్ చేశాడు.

డాక్టర్ సుధాకర్ శవాన్ని పరీక్షించాడు.

"కేస్ ఆఫ్ సూయిసైడ్, ఆత్మహత్య" అన్నాడు డాక్టర్ సుధాకర్.

"ఆమె ఏం మింగింది?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"శవపరీక్ష అయ్యాక అది తెలుస్తుంది" అన్నాడు డాక్టర్ సుధాకర్.

*   *   *

దినపత్రికను చూసి సుబ్బారావు రేఖవైపు తిరిగాడు.

"రేఖా. ఆమె ఆత్మహత్య చేసుకుని మరణించింది. మనం వెంటనే పెళ్ళి చేసుకోవచ్చు" అన్నాడతను.

"మీరు వచ్చి మా తల్లిదండ్రులతో మాట్లాడండి" అందామె.

"ఇవాళ సాయంత్రం యిద్దరం వెళ్దాం" అన్నాడు సుబ్బారావు.

—: సమాప్తం :—